"మా నాన్నగార్ని సిగరెట్లు మానెయ్యమన్నారు కదా, మరి మీరు ఇందాకటినుంచి ఆరు సిగరెట్లు కాల్చేరు కదా. ఇలా అయితే రోజుకు ఎన్ని కాలుస్తారు?" మీకు జబ్బు చెయ్యదా?" అని గడగడా వాగేస్తున్నాడు వాడు.

"తప్పు బాబూ అలా అనకూడదు" అని వారించేను వాడిని.

డాక్టరుగారి ముఖం తెల్లకాగితం అయింది.

....o....

# అప్పగింతలు

ప్రతి సంవత్సరంలాగానే పిల్లలకు పెద్ద పరీక్షలు అయిపోయాయి. వేసవి శలవులు ఇచ్చేశారు. ఎండలు కాస్తున్నాయి. సుమ పిల్లల్ని వెంట బెట్టుకుని తన పుట్టింటికి వేసవి విడిదికి బయలుదేరింది.

తను చేసే ఉద్యోగానికి శెలవులు ఉండవు కాబట్టి సుబ్బారావు మామూలుగా ప్రతి సంవత్సరం తన భార్య పిల్లలు ఊరు వెళ్ళినప్పుడు వండుకుని తింటాడు.

ఆ రోజు వాళ్ళని బస్ ఎక్కించడానికి వచ్చాడు. బస్సు వచ్చింది. అందులో, తన భార్యని, పిల్లల్ని సౌకర్యంగా కూర్చోబెట్టాడు.

ఇక అప్పగింతల కార్యక్రమం మొదలయింది.

"పెద్దదానికి మామిడిపళ్ళు తింటే పడదు. దానికి ఇష్టంకదాఅని ఒకటే పెట్టమాక."

"రెండవవాడికి హార్లిక్స్ లేకపోతే వుండలేడు. నీ దగ్గరవున్న హార్లిక్స్ అయిపోతే నేను ఇచ్చిన డబ్బుతో మళ్ళీ ఒక బాటిల్ తెప్పించుకో."

"చంటాడు ఎండలో తిరుగుతాడు జాగ్రత్త. వాడు నీ మాట వినడు. ఒకవేళ బెంగపెట్టుకుని జ్వరంవస్తే ట్రంకాల్ చెయ్యి వచ్చేస్తాను."

"నువ్వు నీరసంగా వున్నావు. నేను కొనిచ్చిన మాత్రలు రోజు

శ్రద్ధగా వేసుకో. మీ చెల్లెళ్ళతో అర్ధరాత్రి వరకూ సోదిపెట్టుకోకుండా రోజు రాత్రి పెందలాడే నిద్రపో.''

తమని అందరూ చూస్తున్న సంగతి గమనించి సుమకు విసుగ్గా వుంది.

''సరే లెండి'' బస్‌కదిలింది.

ఒక వారంరోజులు గడిచెయి వాళ్ళు వెళ్ళేక.

భార్య దగ్గరనుంచి ఉత్తరం—

శ్రీవారికి

నమస్కారములు—

మీరు క్షేమమని తలుస్తాను. నేను పిల్లలు క్షేమం.

మొన్న బస్‌స్టాండులో చెప్పడం మరిచాను. ఎదురింటి పిన్నిగారు మామిడికాయలు ఇస్తే వాటిని తరిగి ఉప్పులో వేశాను. ఆ ముక్కలు నాలుగు రోజులు ఎండపెట్టి, మాగాయి పోపులో పెట్టండి.

మడి కట్టుకుని ఆవకాయ కలపండి. ఉప్పు తక్కువయితే సరి చెయ్యండి.

రాత్రుళ్ళు దొడ్డితలుపులు జాగ్రత్తగా వెయ్యండి.

బీరువా తాళం రోజూ రాత్రిళ్ళు వేశారో లేదో చూసుకోండి. అవసరమైతే కాని బీరువా తియ్యకండి.

పాలు లెక్కరాయండి, లేకపోతే ఎక్కువ పోశానంటుంది పాలమ్మాయి.

నేను వచ్చేలోగా అప్పులు చెయ్యకండి.

ఇలా వుంది ఉత్తరం.

“ఛీ ఆడాళ్లు, ఇవన్నీ జాగ్రత్తగా వుంచాలన్నమాట. మరి నా సంగతి—అనుకొని వుండచుట్టి పారేసి—మళ్ళీ తను చేయాల్సిన పనులుగుర్తొచ్చి ఆ ఉండ జేబులో కుక్కుకున్నాడు.

పాపం సుబ్బారావు.

....0....